'గ్రీన్‌వుడ్' పూర్వ విద్యార్థి సాయికిరణ్‌ను సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్ భరద్వాజనాయుడు, ఉపాధ్యాయులు

సివిల్స్‌లో ఐపీఎస్ సాధించిన 'గ్రీన్‌వుడ్' పూర్వవిద్యార్థికి సన్మానం

హసన్‌పర్తి, నవంబర్ 6: పట్టుదల, క్రమశిక్షణతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చని గ్రీన్‌వుడ్ పాఠశాల డైరెక్టర్లు భరద్వాజనాయుడు, చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రీన్‌వుడ్ పాఠశాల పూర్వ విద్యార్థి పత్తిపాక సాయికిరణ్ సివిల్స్ పరీక్షలో ఐపీఎస్‌కు ఎంపికైన సందర్భంగా సోమవారం పాఠశాలలో మెమొంటో అందించి వాలువాతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ సాయికిరణ్ పాఠశాలలో క్రమశిక్షణ కలిగిన విద్యార్థిగా ఉండేవాడని, అదే అతడిని ఈ స్థాయికి చేరేలా చేసిందన్నారు. గ్రీన్‌వుడ్ పాఠశాలలో చదివిన ఎంతో మంది డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అయ్యారని తెలిపారు. కాగా సాయికిరణ్ మాట్లాడుతూ గీన్‌వుడ్ పాఠశాలలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివినట్లు తెలిపారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటానని అన్నారు. పాఠశాల జనరల్ మేనేజర్ ప్రభుకుమార్, ప్రిన్సిపల్ వీవీవీ నవీన్‌కుమార్, పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, షేక్ రబ్బాని పాల్గొన్నారు.

'యాంటీబయోటిక్స్' విచక్షణ రహితంగా వాడొద్దు

మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

కరీమాబాద్, నవంబర్ 6: యాంటీబయోటిక్ మందులను విచక్షణ రహితంగా వాడొద్దని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయ విశ్వ విద్యాలయ విస్తరణ అధికారి డాక్టర్ మహేందర్ సూచించారు. సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం మామునూరులో యాంటీ మైక్రోబియా నిరోధకత, పరిష్కారాలు అనే అంశంపై రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ యాంటీబయోటిక్ అధికంగా వాడటం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. రైతులు ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఐనవోలు మల్లన్నకు ఎర్రబెల్లి పూజలు

- మల్లికార్జున స్వామి ఆశీస్సులు, ప్రజల ఆశీర్వాదంతో గెలుపు తథ్యం
- నామినేషన్ పత్రాలు స్వామివారి వద్ద పెట్టి మంత్రి ప్రత్యేక పూజలు

ఐనవోలు, నవంబర్ 6: మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామిని పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం దర్శించుకున్నారు. నామినేషన్ పత్రాలను స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకొని నామినేషన్ వేసిన ప్రతిసారి గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. మల్లన్న ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజల దీవెనలతో గెలుపు వరిస్తుందన్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఎర్రబెల్లికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కార్యకర్తలతో కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, పీపీ శ్యాంసుందర్‌రావు, మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ టీసీఆర్, సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ సతీశ్‌కుమార్, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ దయాకర్, రాజు, మాజీ ఎంపీటీసీ జ్యోతి, మండల నాయకులు వెంకన్న, మధుకర్, పరమేశ్, అనిల్, తిరుపతి, ఆగారెడ్డి, రాజేశ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

స్వామివారికి పూజలు చేస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని

హసన్‌పర్తిలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్

- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి
- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అరూరి రమేశ్

బీఆర్ఎస్ కండువా కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

నయీంనగర్, నవంబర్ 6: హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బొక్క కుమార్ సోమవారం హనుమకొండలోని అరూరి రమేశ్ నివాసంలో వంద మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో చూసి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిని సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. చేరినవారిలో జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బొక్క మార్తమ్మ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు మేకల రమేశ్, సోనియా, శ్రీధర్‌గౌడ్, బోడ ఐలయ్య, జన్ను సురేందర్, ప్రేమ్‌కుమార్, మొగిలి, రవీందర్, ప్రభాకర్, సుమన్, అనిల్, రవి, చక్రి, జ్యోతి, మాధవి, అలేఖ్య, ఇసాక్, భాగ్య, ఇందిరా, రమ, మల్లికాంబ, ప్రేమలత, స్వప్న, రంజిత్, నవీన్, సుమలత చేరారు. డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, ఉపాధ్యక్షుడు ఇమ్మడి రాజేందర్, నాయకులు రవీందర్, సతీష్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జోరుగా బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

వర్ధన్నపేట, నవంబర్ 6: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు వర్ధన్నపేట ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. వర్ధన్నపేట పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, వార్డుల బాధ్యుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి అరూరికి ఓట్లు అభ్యర్థించారు. పార్టీ ముద్రించిన కరపత్రాన్ని ఓటర్లకు అందించిన తొమ్మిదిన్నర ఏండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండు దఫాలుగా ఎమ్మెల్యే రమేశ్ సీఎం కేసీఆర్ సహకారంతో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని, వర్ధన్నపేట పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాజరాజేశ్వరాలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

ఎమ్మెల్యే రమేశ్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ వర్ధన్నపేట బీఆర్ఎస్ నాయకులు ఇల్లంద శ్రీరాజరాజేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యే రమేశ్ లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో గెలుస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకులు ఎండీ అన్వర్, పెద్దబోయిన దేవేంద్ర, మహేందర్, వెంకటేశ్వర్లు, సుధాకర్, ఎర్ర శ్రవణ్, భాస్కర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఐనవోలు, నవంబర్ 6: ఈనెల 8న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మండలంలోని పంథిని సబ్ స్టేషన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు హనుమకొండ రూరల్ విద్యుత్ శాఖ ఏడీఈ దానయ్య తెలిపారు. డివిజన్ పరిధిలోని ధర్మసాగర్, ఐనవోలు మండలాలకు చెందిన వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే సదస్సులో అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

కాశీబుగ్గ, నవంబర్ 6: గ్రేటర్ 3వ డివిజన్ ఆరెపల్లిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎనుమాముల ఎస్సై రాజన్‌బాబు కథనం ప్రకారం.. ఆరెపల్లికి చెందిన జంగా ఉప్పలయ్య సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా. ఆర్టీసీ పరకాల డిపో బస్సు వేగంగా వస్తుండగా ఆందోళనతో కిందపడగా తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి డీసీసీబీ చైర్మన్ పరామర్శ

ఐనవోలు, నవంబర్ 6: మృతురాలి కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన బత్తి మణమ్మ ఆదివారం మృతిచెందగా సోమవారం వెళ్లి మృతదేహాన్ని పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. స్థానిన సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ కొత్తూరి కల్పన, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పరమేశ్, నాయకులు పుల్యాల రాజిరెడ్డి, మధుకర్, బాబు ఉన్నారు.

కళోత్సవ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

ఐనవోలు, నవంబర్ 6: మండలంలోని ఎమ్మార్పీ ఆధ్వర్యంలో సోమవారం కళోత్సవ్‌లో విద్యార్థులు ప్రతిభచాటారు. ఎస్ పూజిత సంప్రదాయ పాటలు, జీ అశ్విత ఫోక్ సాంగ్స్, సీహెచ్ కావిక సంప్రదాయ డ్యాన్స్, ఎం సరి సింగారం ఫోక్ సాంగ్స్, హర్షిణి విజువల్ ఆర్ట్స్, శ్రావణి ఇండిజినియస్, అక్షయ ఏకపాత్ర అభినయంలో (కేజీబీవీ), ఎం శ్యామ్ ఫోక్‌సాంగ్స్ (ఒంటిమామిడిపల్లి జడ్పీ పాఠశాల) ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీహర్షుడు, కాంప్లెక్స్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎం కోటగిరి సునీత, సీఆర్‌పీ రాజ్‌కుమార్ అభినందించారు.